# పచ్చ కాగితం

ఇందిర చెడ్డ పిల్ల కాదు. ఆమెకున్న లోపమల్లా ఏమిటంటే భావనాశక్తి లేకపోవటం. ఈ లోపం సంఘంలో అసంఖ్యాకుల కున్నది. అదీగాక భావనాశక్తి అనేది సాంఘిక జీవితంలోనూ, వ్యక్తి జీవితంలోనూ, నీతి విషయంలోనూ ఏ విధంగా ఉపకరిస్తుందో అనేకమందికి తెలీదు. అందుచేత సమాజంలో భావనాశక్తి లేకపోవటమనేది వ్యక్తిలో ఒక లోపంగా ఎంచబడదు. డబ్బు లేకపోవటం ఒక లోపం. నీతిని అంటిపెట్టుకుని ఉండలేక పోవటం మరో లోపం. ఆడదానికి అంతో ఇంతో అందచందాలు లేకపోవటం ఇంకోలోపం - భావనాశక్తి ఉందా లేదా అని విచారించే వాళ్ళు లేరు.

ఇందిరకు పన్నెండోఏట పెళ్ళయింది. అయిదారు సంబంధాలు చూసి వెంకట నారాయణను ఎన్నుకున్నారు వాళ్ళవాళ్ళు. ఇందిరకు సొంతంగా ఒక అభిప్రాయ మంటూ లేకపోవటంచేత ఉన్నంతలో తనకు మంచి మొగుడే దొరికాడని ఆమె నమ్మింది. అతనితో కాపరం చేసి, పిల్లల్నికని, అతనికీ, పిల్లలకీ కాచిపోసి కాలం వెళ్ళబుచ్చటానికి ఆమె సంసిద్ధురాలయింది. ప్రేమను గురించి ఆమె కలలు కనలేదు, సరికదా ఆలోచించను కూడా లేదు. పెళ్ళామైన మనిషి మొగుడిపై చూపించే ఉత్తమ మైన అభిమానం ఏమంటే అతనేమన్నా అంటే పడటమూ, అతనికి చేతనయిన సేవ చెయ్యటమూ, అతనిచ్చే పూలూ, చీరెలూ, నగలూ పెట్టుకోవటమూ, బతికున్న న్నాళ్లూ అతని పెళ్ళాంగానే ఉండటమూనూ. ఇందిర దృష్టిలో మొగుడితో పోట్లాడి పుట్టింటికి వెళ్ళి కూచునే వాళ్ళు, నగలూ అవీ పెట్టలేదని సాధించేవాళ్లూ, మొగుడి మీద ఇరుగు పొరుగు అమ్మలక్కలతో చాడీలు చెప్పేవాళ్ళు, మొగుణ్ణి వదిలేసి ఎవడితోనో లేచి పొయ్యేవాళ్లూ చెడ్డ పెళ్ళాలు. ఈ రకాలను ఆమె స్వయంగా చూసింది. వాళ్ళను గురించి చూసిన దానికన్న ఎక్కువగా విన్నది. ఆ రకాలంటే ఆమెకు అసహ్యం.

నీతిని గురించి ఇందిరకున్న భావాలు కూడా అతి స్థూలమైనవి; కామబాధ ఏమిటో అది ఎట్లా నివారణ అవుతుందో కూడా ఆమెకు స్పష్టంగా తెలీదు. కాని రంకుతనం తప్పని ఆమె విశ్వాసం. దానికి కారణమేమంటే రంకుతనం తప్పని అందరూ అంటారు. రంకుతనం చేసేవాళ్ళను గురించి అసహ్యంగా చెప్పుకుంటారు, అసహ్యంగా చూస్తారు, వాళ్ళని మొగుళ్ళు వదిలేస్తారు, వాళ్ళకి దిక్కూ మొక్కూ ఉండదు. ఆడది మొగుడు లేకుండా నిక్షేపంగా బతకవచ్చు, మొగుడుపోయిన వాళ్ళు

బతకటంలా ? అటువంటి దానికి మొగుడుండగా రంకుమొగు డెందుకూ ? అందరు మొగవాళ్ళూ ఒకటే ? ఇక కొందరు ఆడవాళ్ళు రంకుతనం చెయ్యటం దేనికి అంటే వాళ్ళ పొగరు, తలకాయలో జబ్బు - అంతకంటే ఏమీ లేదు.

చిత్రమేమిటంటే రంకుతనం సుఖరోగాదులకు దారి తీస్తుందని, దాని ద్వారా కడుపులు కావటమూ, భ్రూణహత్యలూ మొదలైన చిక్కు లేర్పడతాయనీ కూడా ఇందిరకు తెలియదు.

ఇందిరను మనం తప్పుపట్ట నవసరంలేదు. సంఘంలో నీతి అనేది అమలు జరుగుతున్నది, నూటికి తొంభై తొమ్మిదిపాళ్ళు ఇటువంటి విశ్వాసాల మీదే. భార్యాభర్తలు వివాహ బంధానికి కట్టుపడి ఉంటున్నారు కాని, ప్రేమ బంధానికి కట్టుపడి వుండటం లేదు. ఈ వివాహబంధం ఆడదాన్ని కట్టినంత బలంగా మొగవాణ్ణి కట్టటం లేదేమో. మొగవాడు ఆడదానికంటె స్వేచ్ఛగా నీతిని ధిక్కరిస్తున్నాడు.

* * *

ఇందిర కిప్పుడు పధ్నాలుగో ఏడు. వచ్చే డిసెంబరు శలవుల్లో అల్లుణ్ణి ఇక్కడికే తీసుకు రమ్మని చదీచప్పుడు లేకుండా అవశిష్టం పూర్తిచేసేద్దామనుకుంటున్నాడు ఇందిర తండ్రి. ఇందిరకు ఒక్క అన్న మాత్రమే ఉన్నాడు అతను కూడా ఇందిర మొగుడిలాగే బియ్యే రెండో సంవత్సరం చదువుతున్నాడు.

ఇందిర తండ్రి ఏమంత కలవాడు కాడు. ఒకప్పుడేదో అన్న వస్త్రాలకి లోపం లేకుండా ఉండేది. కాని ఆరోజులిప్పుడు కలలోకి కూడా రావటంలేదు. ఎప్పుడు కొడుకు చదువు పూర్తిచేసి నాలుగు రాళ్ళు తెస్తాడా అని ఆ మానవుడు ఆశ పెట్టుకుని ఎదురు చూస్తున్నాడు కట్నమంటూ చిల్లిగవ్వ అల్లుడి కివ్వకపోయినా ఇందిర పెళ్ళి చేసేసరికి ఆయన నడుం విరిగిపోయినట్టయి పోయింది. కొడుక్కు ఏ నెల కానెల అరవయ్యో డెబ్బయ్యో పంపాలంటే పీకల మీదికి వస్తున్నది. నిర్బంధంలోవున్న ఖైదీ రోజులు లెక్కించినట్టు ఆయన నెలలు లెక్కిస్తున్నాడు.

తన తండ్రి డబ్బు కోసం పడే ఇబ్బంది ఇందిర చూస్తూనే ఉండేది. ఎంత చెడ్డా తన మొగుడు తన తండ్రి కన్న కాస్త మంచి స్థితిలో ఉండటం తలుచుకుని ఆమె సంతోషించేది.

ఆమెకు నీతి అయినా అర్థమయ్యేది గాని డబ్బు అసలే అర్థమయ్యేదికాదు. ఆమె పక్కనే ఉన్న పార్వతమ్మగారింటికి తరుచూ పోతూ వుండేది. వాళ్ళు చాలా డబ్బుకలవాళ్ళు. మళ్ళీ వాళ్ళకూ్కడా సెంటుపొలం లేదు. ఆ పార్వతమ్మ మొగుడు ఏవో కంట్రాక్టులూ అవీ చేస్తాడు. వాళ్ళింట్లో చక్కగా అన్నీ అమరి వుంటై. దేనికీ తడువుకోనవసరం లేదు. ఆవిడ చూసిన చీరల్లా కొంటుంది. పళ్లూ, పూలూ రోడ్డు వెంట పోనివ్వదు. కొంటే కాసినీ కూసినీ కొనదు. ఊరికే వచ్చినట్టుగా రెండు చేతులా దానం చేస్తుంది. ఆవిడకి పిల్లలు లేరు. ఇందిరను చాలాఅపేక్షగా చూసేది. ఇంటికి వస్తే ఊరికే వెళ్ళనిచ్చేది కాదు.

వాళ్ళింటికి సోమయాజులని ఒకతను వచ్చేవాడు. పార్వతమ్మ అన్నకొడుకట. అతనికి ముప్పై ఏళ్ళుకూడా వుంటయ్యో, వుండవో. యుద్ధంలో పాతిక ముప్పై వేలు సంపాదించాడుట. భలే అందమైన సూట్లు వేసుకునేవాడు. ఇందిరతో చాలా చనువుగా మాట్లాడేవాడు. నెలకొకసారన్నా వచ్చి పోతూండేవాడు. వచ్చినప్పుడు వారం రోజులూ, పదిరోజులూ ఉండేవాడు. తనను చూసి సంతోషించటానికే అతను ఇంత తరుచుగా వస్తున్నాడని పాపం. ఇందిరకు తెలియదు.

ఇందిరకు భావనాశక్తి లోపిస్తే సోమయాజులుకది చాలా ఎక్కువగా ఉంది. అతను రెండేళ్ళ కిందటనే ఇందిరను చూసి ప్రేమించాడు. అతన్ని ఆకర్షించింది ఇందిర అందమేనని చెప్పటానికి వీల్లేదు. అతను అందమైన ఆడవాళ్ళ మొహం ఎరగనివాడు కాడు. అతని భార్యే అందగత్తె అని ఖ్యాతి పొందిన మనిషి ఇందిర మొహంలో అమాయకత్వమో, మరేదో అతన్ని మొదట్లో ఆకర్షించింది. ఆమె ఎప్పుడూ తన దగ్గరే ఉంటే తనకు ఇంకో విధంగా లభించని పరమానందం ఏదో లభిస్తుందనిపించేది సోమయాజులకు. తినటానికి పుష్టిగా ఉండి తన కోరికలన్నీ అవలీలగా తీర్చుకునేటందుకు డబ్బున్నవాడికి ప్రేమ ఒక జీవితావసరంగా పరిణమిస్తుంది. అందుచేత ఇందిరను సోమయాజులు ప్రేమించాడు. ఇతర స్త్రీలను కామించటానికి ఈ ప్రేమ అతనికి అడ్డురాలేదు. అయితే ఆ కామం కూడా ఈ ప్రేమకు అడ్డురాదనే చెప్పాలి.

సోమయాజులు ప్రేమ రకరకాల కలలు కనేది. ఇందిరకు మంచి ఇల్లుకట్టించి పెడదామనీ, ఒక కారును కొనిపెడదామనీ, ఆమెను సినిమా తారలాగా అలంకరించి తనవెంట తీసుకుని ప్రపంచమంతా పర్యటిద్దామని అతను కలలు కనేవాడు. ఇవన్నీ చేసేటందుకు తన దగ్గర డబ్బులేదు. ఉన్నా ఇట్లా తన వెంట తిరగటానికి ఇందిర ఒప్పుకోదని అతనికి తెలుసు. కాని కలలు కనడానికేం ?

పార్వతమ్మ ఏమైనా పనిమీద ఏ వంట ఇంటోనో ఉండగా ఇందిరను కులాసాగా కబుర్లలో పెట్టేవాడు. శృంగార సంబంధమైన కబుర్లు కూడా చెప్పేవాడు. కాని ఆమె చలించేది కాదు. ఏది చెప్పినా విని ఊరుకునేది. అతను నవ్వితే తను కూడా నవ్వేది. ఒకసారి నగ్నస్త్రీల ఫోటోలు చూపించాడు. "ఎబ్బే, ఛీ" అన్నది ఇందిర.

"తప్పేం ? పువ్వులు అందంగా వుంటే చూడవచ్చును గాని ఆడవాళ్ళు అందంగా ఉంటే చూడకూడదా ? ఇటువంటి ఆడది నా దగ్గిరికి వస్తే నూరురూపాయలిస్తా" అన్నాడు సోమయాజులు. ఇందిర మాట్లాడలేదు.

* * *

నవంబరు నెల వచ్చింది. సోమయాజులు వచ్చాడు. వచ్చేనెల ఇందిరనూ మొగుణ్ణీ కలుపుతారుట అని పార్వతమ్మ చెప్పింది. సోమయాజులుకు ఒళ్ళంతా జెర్రులు పాకినట్లయింది. పార్వతమ్మతో తన బాధ కాస్త చెప్పేశాడు.

పార్వతమ్మ అదో రకం మనిషి. ఆమె వస్తుతహా నీతికలదే కాని అవినీతి మనుష్యులకిచ్చే ఆనందం యావత్తూ ఆమె పరోక్షంగా అనుభవించేది. సోమయాజులు తన ప్రణయగాథలన్నీ ఆవిడకు పూసగుచ్చినట్లు చెప్పేవాడు.

"ఛీ ఛీ! ఇందిర అమాయిక పిల్లరా!" అన్నది పార్వతమ్మ. కాని ఆమె పెదవులమీద తాండవం చేసిన మందహాసం సోమయాజులుకు ప్రోత్సాహమిచ్చింది.

ఆ రోజు సాయంకాలం ఇందిర వచ్చిన అయిదు నిమిషాలకల్లా పార్వతమ్మ తలంటుకని బయలు దేరింది.

"పిన్నిగారూ, నేను నురుగు పొయ్యనా?" అన్నది ఇందిర.

"ఎందుకులే! ఇప్పుడే వస్తాగా, కూర్చో, సోమయాజులుతో కబుర్లు చెప్పు." అంటూ పార్వతమ్మ స్నానాలగది చేరింది.

సోమయాజులు సావడిగది తలుపువేసి ఇందిరను పడక గదిలోకి తీసుక పోయినాడు. అద్దం ముందు ఆమెతో సహా నిలబడి ఆమెను వెనకనించి కావలించు కున్నాడు

"ఇందిరా, గుడ్డలు లేకుండా కనిపిస్తే నీకు నూరు రూపాయలిస్తాను. నీ అందం చూడాలని ఉంది" అన్నాడు.

"తప్పు కాదూ!" అన్నది ఇందిర.

"ఆ ఫొటోలు తీయించుకున్నవాళ్ళు తప్పుడు వాళ్ళేనా?"

"మరి అందరూ గుడ్డలు కట్టుకోవటం దేనికి?" అన్నది ఇందిర. ఆమెకు భయమన్నా కలగలేదు.

"ఒళ్ళు అంద వికారంగా ఉంటే గుడ్డలు కట్టుకుంటారు. అందమైన ఒళ్లున్న వాళ్ళు ఇష్టమైన వాళ్ళకు ఒళ్ళు చూపించవచ్చు. నేనంటే నీ కిష్టంకదూ?"

"ఇష్టమే!"

ఉపాయంగా, తొందర పడకుండా, దడదడలాడే గుండెతో సోమయాజులు ఇందిరను వివస్త్రను చేశాడు. మళ్ళీ వెంటనే ఆమె గుడ్డలు కట్టుకోబోయింది. తన నగ్న స్వరూపం అద్దంలో చూసుకుని ఇందిర భయపడింది.

"ఉండు. తొందరేం!"

"పిన్నిగారు వస్తుంది."

"ఇంకో గంటదాకా రాదు."

ఇందిరను అట్లాగే చేతుల్లోకి ఎత్తుకుని తీసుకపోయి పక్కమీద పడుకో బెట్టాడు. ఇందిరకు బొత్తిగా ప్రపంచజ్ఞానం లేదని సోమయాజులు గ్రహించాడు. ఆమె భయపడలేదు. తనకి గట్టిగా ఎదురు తిరగలేదు. ఆమెకు తగినంత ఉద్రేకం గానీ, దాని వెంటవచ్చే సంతృప్తిగానీ రాలేదు. పెపెచ్చు ఆలింగనాలూ, ముద్దులూ, కామ సంతృప్తి కలిగించుకునే పద్ధతీ ఆమెకు రోత పుట్టించినై.

సోమయాజులు ఉద్రేకంతోపాటు అతని ప్రేమ కూడా పటాపంచలై వస్తుతహ మంచివాడు కనక ఆమె మీద జాలి కలిగింది.

"ఇదేమిటో ఇప్పుడు తెలిసింది కనక ఇకముందు ఇష్టం లేకుండా ఈ పని చెయ్యను. నేను చెడ్డపని చేశానని తిట్టుకోను. నీమీద ఎంతో ప్రేమతోనే ఈ పాడు పని చేశాను. నీకేమీ నష్టం లేదులే. ఎవరితోనూ అనకు. ఈ రహస్యం బయట పడితే నిన్ను కాకులు పొడిచినట్టు పొడుస్తారు." అన్నాడు సోమయాజులు.

ఈ మాట లెందుకంటున్నాడో కూడా ఇందిరకు అర్థం కాలేదు. ఆమెకు అతని మీద ఏమీ కోపం లేదు. ఇదే తను ఇంతకాలమూ ద్వేషించిన రంకుతనమని కూడా ఆమెకు తట్టలేదు.

కొంతసేపటికి పార్వతమ్మ తలంటు పోసుకుని వచ్చింది. సావిట్లో కూర్చుని ఉన్న సోమయాజులనూ, ఇందిరను పరికించి చూసింది; ఇందిర భావరహితమైన కళ్ళతో ఆమెకేసి తొణకకుండా చూసింది... సోమయాజులు మొహం చూసే దాకా పార్వతమ్మకు నిజం తెలియలేదు.

"ఇందిరా, నీవు కూడా తలంటు కోరాదటే? చీరె ఇస్తాను" అన్నది పార్వతమ్మ.

ఇందిర వినిపించుకోలేదు.

"ఇంకా బోలెడన్ని వేణ్ణీళ్ళు మిగిలిపోయినై" అన్నది పార్వతమ్మ, జుట్టుకు తువాలు బిర్రున బిగిస్తూ. ఇందిర మారు మాటాడకుండా లేచి స్నానాల గదిలోకి పోయింది.

ఆమె తలంటుకుని, పార్వతమ్మ ఇచ్చిన కొత్తచీరె కట్టుకుని, తలచిక్కు తీయించుకుని, వదులు జడ వేయించుకుని ఇంటికి బయల్దేరే సమయానికి దీపాలుపెట్టే వేళయింది.

ఆమె సావిట్లోకి రాగానే సోమయాజులు ఎదురుపడి, "ఇందిరా. మాట." అని పక్కవాకిలిగుండా ఆవరణలోకి తీసుకపోయినాడు.

"ఏమిటి?" అన్నది ఇందిర.

"నేను రాత్రికి వెళ్ళిపోతాను. మళ్ళా ఇప్పట్లో రాను.... ఇంద" అన్నాడు.

"ఏమిటిది ?"

"నూరు రూపాయల నోటు. ఎవరికీ కనిపించకుండా దాచు. ఎంతో అవసరం కలిగినప్పుడు వాడుకో, జాగ్రత్త" అన్నాడు సోమయాజులు.

ఆ పచ్చనోటు తాను చేసినదానికి ప్రాయశ్చిత్తమే అనుకున్నాడో, ఇందిర దగ్గర పుచ్చుకున్నదానికి ప్రతిఫలమే అనుకున్నాడో, ఆమెకు తన నుంచి లభించే సహాయానికిది ప్రత్యక్ష తార్కాణమనుకున్నాడో చెప్పలేం.

ఇందిరకు ఆ నోటు అర్థం కాలేదు. అందులో చాలా డబ్బుందని ఆమెకు తెలిసింది. అది తీసుకోవటం తప్పనిపించలేదు. దాన్ని తన కివ్వటంలో సోమయాజులు మంచితనమే ఉందో, చెడ్డతనమే ఉందో కూడా ఆమెకు స్ఫురించలేదు. దాన్ని తీసుకుని మడిచి, చిన్నది చేసి రొంటిన దాచుకొని "పోతున్నా" అని చెప్పి వెళ్ళిపోయింది.

ఇంటికి పోగానే కూతురి అవతారం చూసి తల్లి, "ఇదేమిటేవ్" అన్నది సంతోషంతో.

"పిన్నిగారు తలంటిపోసి చీరె ఇచ్చింది" అన్నది ఇందిర.

ఇందిరకు వేరే ఒక చిన్న కొయ్యపెట్టె ఉంది. దాని జోలికెవరూ రారు. అందులో ఆమె బట్టలుంటై. బట్టల అడుగున న్యూస్‌పేపరు కాగితం కింద ఇందిర నూరు రూపాయల నోటు దాచింది.

ఇందిరలో మార్పున్నట్టుగా ఎవరూ గమనించలేదు. ఒకవేళ పైకి మార్పు లేదేమో. కాని లోపల– ఇందిర బుర్రలో– ఏవో భావాలు ఆకారం పొందటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నై.

ఆ రాత్రి అందరూ నిద్రపోయిన తరువాత కూడా ఆమెకు నిద్రపట్టలేదు. మెడ దాకా దుప్పటి తన్నిపట్టి దాని చాటున తన తొడలూ, రొమ్మూ నిమురుకున్నది. ఏదో వెలితిగా తోచింది.

రైలు కూత వినిపించింది. మెయిలు కూత. దానిమీద సోమయాజులు వాళ్ళ ఊరు వెళ్ళి ఉంటాడు. కాని ఆమెకు సోమయాజులు జ్ఞాపకం రాలేదు. అతన్ని అప్పుడే మరిచిపోయింది. అతను మళ్ళీ కనిపించడేమో అనే విచారం ఆమెకేమీ లేదు. కాని సాయంకాలం అయిన అనుభవం తనకు మళ్ళీ ఎప్పటికవుతుందో అని ఆమె విచారించింది. తన మొగుడు తనను నగ్నంగా చూస్తాడా, తనను చేతుల్లోకి ఎత్తుకుంటాడా, ముద్దులాడుతాడా– ఈ విధంగా అనుమానం కలగసాగింది. నాలుగు గంటల క్రితం అసహ్యంగా తోచిన సోమయాజులు చర్యలు ఇప్పుడు తలుచుకుంటే అసహ్యంగా కనిపించలేదు.

* * *

"అబ్బాయికి పరీక్షకు కట్టటానికి డబ్బు పంపాలిట. ఏం చెయ్యను?" అన్నాడు ఇందిర తండ్రి.

మగవాడు ఆయనకే తెలియకపోతే, ఆడది– ఇల్లుదాటి బయటికి పోని మనిషి– ఇందిర తల్లి ఏం చెబుతుంది?

డబ్బు పుట్టించటానికి తన తండ్రి పడుతున్న పాట్లూ, బాకీదార్ల చేత అడిగించు కుంటున్న మాటలూ, సమస్తమూ ఇందిరకు తెలుస్తూనే ఉంది. తన పెట్టెలో ఉన్న నూరు రూపాయల నోటుతో చాలా భారం తొలగిపోతుంది. కాని ఎట్లా ఇవ్వటం? ఎక్కడిదంటే ఏం చెప్పాలి? తన తల్లికో తండ్రికో దొరికేటట్టుగా ఎక్కడన్నా

పెడితే? వాళ్ళు దాన్ని తీసుకుని సంతోషిస్తారా? "ఇదెక్కడ్డించి వచ్చింది?" అని అడగరూ? వాళ్ళిద్దరికీ తెలియకపోతే ఇక తనకేగా తెలియవలసిందీ?

పోనీ "పిన్నిగారి" దగ్గర తీసుకొచ్చినట్టు నటిద్దామంటే, మొదటి సంగతి, తన తండ్రి ఒప్పుకోడు—ఆవిడ అదివరలో పెట్టిన పెట్టుడుకే ఆయన చాలా చిన్న బుచ్చుకుంటున్నాడు. ఆ మాట అట్లా ఉండగా "పిన్నిగారు" నేనివ్వలేదని తన తల్లితో అనేస్తే.... తన రహస్యం ఆవిడకు తెలుసునని ఇందిరకు ఏ కోశానా అను మానం లేదు.

అట్లాగూ కాకపోతే ఎవరిచేతనన్నా తన అన్నకు డబ్బు మనియార్డరు చేయిస్తే? ఎవరు చేస్తారు? వాళ్ళు ప్రశ్నలడగరూ? తనవంటి చిన్నపిల్లదగ్గర నూరు రూపాయల నోటుందంటే ఎవరికన్నా అనుమానమేగా? పైగా తనకు అన్న చిరునామా కూడా తెలీదు.

వారం రోజులయింది. ఇందిర తండ్రి అందరిచేతా లేదనిపించుకున్నాడు. ఆఖరుకు ఇందిర వంటిమీది రెండు వస్తువులూ తాకట్టుపెట్టి కొడుక్కు డబ్బుపంపించాడు.

ఇందిర చూస్తూ ఊరుకుంది.

డిసెంబరు వచ్చింది. సెలవులిచ్చారు కాలేజీలకు. ఇందిర అన్న ఇంటికి వచ్చాడు. ఇంకో వారంలోగా ఇందిర మొగుడే వస్తాడు. ఇందిర వస్తువులింకా తాకట్టులోనే ఉన్నై. ఇందిర తండ్రి యమచెర అనుభవిస్తున్నాడు. వాటిని విడిపించటానికి డెభ్భై అయిదురూపాయలు కావాలి. ఎక్కడనుంచి వస్తుంది? ఎవరింటికి కన్నం వేస్తే ఎవరూరుకుంటారు?

రేపే వెంకట నారాయణ వస్తున్నాడు. ఇందిర తల్లిదండ్రులతో చెప్పకుండా పార్వతమ్మగారింటికి పరిగెత్తింది.

"పిన్నిగారూ, మాకు వంద రూపాయలు అర్జంటుగా కావాలి. అప్పివ్వరూ?" అని అడిగింది ఇందిర.

"వందరూపాయలా? ఇద్దునుగాని మీ బాబుగారికి తెలిస్తే కేకలేస్తారే" అన్నది పార్వతమ్మ. ఇందిర తండ్రికి అప్పిస్తే వెంటనే రాదని ఆవిడకు తెలుసు. పార్వతమ్మ ఎంత దూబరా మనిషో ఆవిడ మొగుడంత జాగ్రత్త గల మనిషి. ఒకట్లూ అయిదులూ పెళ్ళాం ఖర్చు చేస్తుంటే ఆయనకు తెలిసి కూడా ఊరుకొనేవాడు. ఏనాడు ఆవిడ ఖర్చు అయిదు దాటినా పట్టుకునేవాడు.

పార్వతమ్మ ఇవ్వదని భయం వేసింది. ఇందిర ఇంకో ఆలోచన చేసింది.

"ఉంటే ఒక వంద ఇవ్వండి పిన్నిగారూ. మళ్ళా రేపో ఎల్లుండో మా నాన్న తప్పక తీరుస్తాడు. నాదీ పూచీ" అన్నది ఇందిర.

పార్వతమ్మ అనుమానిస్తూనే పది రూపాయల నోట్లు ఎంచి ఇచ్చింది. ఇందిర మొగుడు వచ్చేలోగా నగలు కొంప చేరినై.

మర్నాడుదయమే తన భర్త తలంటి పోసుకుంటుండగా ఇందిర తన పెట్టెలో నూరు రూపాయల నోటు తీసుకపోయి పార్వతమ్మకిచ్చేసింది.

"ఓసి నీ యిల్లు బంగారంగానూ, అప్పుడే తెచ్చిచ్చావుటే .... అవునుగానీ, మీ ఆయనొచ్చాడా?" అంటూ పార్వతమ్మ ఏవో వరసలాడి పంపించింది.

మధ్యాహ్నం వేళ ఇందిర తల్లి అక్కడికి ఫలహారం యేపుతుండగా పార్వతమ్మ వచ్చింది. ఇందిర మెగుణ్ణి పలకరించింది. పోతూ పోతూ ఇందిర తల్లితో "అవునుగానీ, డబ్బు ఇంతలోనే పంపించకపోతే ఏం మునిగిపోయిందీ?" అన్నది.

"ఏం డబ్బా?" అన్నది ఇందిర తల్లి.

"నిన్న నేను అప్పిచ్చిన డబ్బు వెంటనే పంపించారే? పెట్టెలో ఉంటే పెట్టి తూటి పడుతుందన్నట్టు?" అన్నది పార్వతమ్మ.

"ఎవరిచ్చారు?"

"మీ ఇందిరే" అన్నది పార్వతమ్మ.

"దానికెక్కడిదీ? ఎవరిచ్చారు?" అన్నది ఇందిర తల్లి.

పార్వతమ్మ ఏదో మాటవరస కన్నదిగాని, ఇందిరతల్లి దాన్నిగురించి పంచాయతీ ఆరంభిస్తుందని కల్లోకూడా అనుకోలేదు.

"మీ ఆయన పంపించారేమోలే" అన్నది పార్వతమ్మ.

"మా ఆయన ఎక్కడిచ్చారు? నాకు తెలీదూ?" అన్నది ఇందిర తల్లి.

అన్నీ వైనంగా తేలితేగాని వదిలిపెట్టలేని రకం ఇందిర తల్లి. ఆవిడ గబగబా వెళ్ళి నిద్రపోతున్న ఇందిరను లేపింది.

"ఏమే, నువు పార్వతమ్మగారికి బాకీ తీర్చావా?" అన్నది తల్లి.

"ఏం బాకీ నాకు తెలియదే" అన్నది ఇందిర.

పార్వతమ్మకు ఏదో అర్థమైనట్టయింది.

"ఓసి పిచ్చిదానా, నిన్న తీసుకున్న రూపాయి ఇవాళ తిరిగి ఇవ్వలేదుటే?" అన్నదావిడ ఇందిరతో. ఇందిర తల్లికంతా అర్థమైంది!

"సారి, రూపాయిమాటా మీరు మాట్లాడుతున్నదీ?" అన్నదావిడ.

ఇందిర తృప్తిపడింది. ఇందిర తల్లి తృప్తిపడింది. పార్వతమ్మ కూడా తృప్తిపడింది. ఇదంతా ఆలకించిన వెంకటనారాయణే తృప్తి పడలేదు. ఎప్పుడు రాత్రి అవుతుందా అని అతను వేచి ఉన్నాడు.

* * * *

రాత్రి తొమ్మిది దాటగానే ఇందిరను ఉన్నంతలో అలంకరించి మొగుడి గదిలోకి పంపించారు. ఆమె లోపలికి రాగానే వేంకటనారాయణ పక్కమీదినుంచి లేచివచ్చి గది తలుపు గడియపెట్టాడు.

ఇందిర అతనివెంట పక్క దగ్గిరికి పోలేదు.

"రా" అన్నాడు వెంకటనారాయణ. అందులో ఏ విధమైన లాలిత్యంగాని లేదు. అధికారం ఉంది. ఆశలు రేగే హృదయంతో ఇందిర అతన్ని సమీపించింది.

"అయితే నువ్వు వాళ్ళదగ్గరా, వీళ్ళదగ్గిరా డబ్బులు చేబదులు పుచ్చుకుని పెద్దవాళ్ళకు తెలీకుండా తీర్చేస్తూ ఉంటావా ఏం?" అన్నాడు.

"తప్పా?" అన్నది ఇందిర.

"తప్పకాదూ? అణాకాదు, బేడాకాదు, రూపాయి! నువ్వు రూపాయిదాకా ఎందుకు - అప్పు చెయ్యావలసి వచ్చింది?"

"ఏదో చేశాను"

"నా దగ్గిరకూడా దాపరికమే?"

"దానికీ దానికీ చేశాను. నా కిప్పుడు జ్ఞాపకంలేదు"

"నిన్న చేసిన అప్పు దేనికి చేశావో జ్ఞాపకం లేదా? నాతోనే అబద్ధాలు?"

"నాకోసం చెయ్యలేదు. ఇంటో ఖర్చుకని చేశాను"

"ఇంట్లో ఖర్చుకని నువు అప్పు చెయ్యాలా? మీవాళ్ళు తెచ్చుకోలేరూ?"

"నా కావిడ దగ్గిర చనువు, అందుచేత అడిగితే ఇస్తుంది"

"ఎందుకు చనువూ? నీకూ ఆవిడకు ఏమిటి ప్రత్యేక సంబంధం?"

ఈ ప్రశ్నల పరంపర ఒకంతట ఆగలేదు ఉప్పుపాతరల్లే ప్రశ్నలు ఊరుతూనే ఉన్నై. అతని ప్రశ్నలకన్నా ఆమెకు విసుగెత్తించిన దేమంటే అతను ప్రశ్నలు వేసే పద్ధతి.

వెంకటనారాయణకు ప్రణయ సంబంధమైన అనుభవం ఏమీలేక ఈ చొప్పదంటు ప్రశ్నలు వేస్తున్నాడని ఇందిరకు తట్టలేదు. కాని తెల్లవారే లోపుగా ఆ సంగతి కూడా అర్థమయింది.

మర్నాడు ఇందిర పార్వతమ్మగారింటికి వెళ్ళింది. గడచిన ఒక్క రాత్రి లోనూ ఇందిర పదేళ్ళు పెరిగింది. ఆమె భావనాశక్తి నూరింతలు పెరిగింది.

"నిన్న నన్ను రక్షించారు" అన్నది ఇందిర.

"నాతోచెప్పగూడదుటే? నీ డబ్బు నువ్వుతీసుకుపో" అన్నది పార్వతమ్మ.

"ఉంచండి, మానాన్న ఎప్పటి కిస్తాడో" అన్నది ఇందిర.

"అప్పిచ్చానని మావారితో చెబితే కోప్పడ్డారు. ఊరికే ఇవ్వకపోయినావా అని!"

"అట్లా అయితే సోమయాజులుగారి కిచ్చెయ్యండి"

"నువ్వుంచుకోవే!"

"దేనికీ? ఆయన దగ్గర తీసుకున్నది చాలదూ?" అన్నది ఇందిర.

"మీ ఆయన........ఎటువంటి వారే?"

"పుచ్చుకుంటే ఆయన దగ్గిర పుచ్చుకోవాలి నూరు రూపాయలూనూ" అన్నది ఇందిర.

చిత్రమేమంటే ఇందిర బుద్ధి వికసించినాక ఎన్నడూ అవినీతిగా ప్రవర్తించటానికి ప్రయత్నించలేదు. తనకు ప్రేమ అంటే ఏమిటో అర్థం కావటంవల్ల ఆ మొగుడిమీదనే ప్రేమ చూపటమూ, ప్రేమ చూపే పద్ధతులు అతనికి నేర్పటమూ ఆమెకు సాధ్యమయినై.

ఇవాళ ఎవరైనా ఇందిర వెంకటనారాయణరావుల దాంపత్యాన్ని ఆదర్శంగా చెప్పుకుంటారు.

ముద్రణ :

ఆంధ్రజ్యోతి మాసపత్రిక,
జూలై, 1949